అజార్‌గల్లీలో తాగునీటికి ప్రజల ఇక్కట్లు

అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటున్న స్థానికులు

ముషీరాబాద్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్ బాపూజీనగర్‌లో 15 రోజులుగా తాగునీటి సమస్యతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. తాగడానికి నీళ్లు లేక వాటర్ బాటిల్స్ కొనుగోలు చేస్తున్నామని స్థానికులు పేర్కొంటున్నారు. ఇటీవల జలమండలి అధికారులు అజార్‌గల్లీలో తాగునీటి కొత్త పైప్‌లైన్ వేసినప్పటికీ నీటి ప్రెషర్ రాకపోవడంతో స్థానికంగా నివసిస్తున్న సుమారు 40 కుటుంబాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు అందరు కలిసి జలమండలి అధికారులకు ఫిర్యాదు చేస్తే ఇప్పటివరకు మూడు చోట్ల తవ్వి పైప్‌లను గుర్తించినప్పటికీ తాగునీటి సమస్య పరిష్కారం కాలేదని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



అజార్‌గల్లీలో పబ్లిక్ ట్యాప్ వద్ద నీటికోసం వేచి ఉన్న మహిళలు

వాటర్ ట్యాంక్‌లు కూడా పంపడం లేదు



నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నాం. కనీసం వాటర్ ట్యాంక్‌లు అయినా పంపించండి అని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. అజార్‌గల్లీలో మూడు చోట్ల తవ్వి పైప్‌లైన్‌ను పరిశీలించినా సమస్య పరిష్కారం కాలేదు. ఆదివారం మరోసారి రాంనగర్ చౌరస్తా సమీపంలో అజార్‌గల్లీ వీధిలో తవ్వకాలు చేపట్టి కొత్త పైప్‌లైన్, పాత పైప్‌లైన్లను పరిశీలించారు.

- నర్సింగ్‌రావు, అజార్‌గల్లి అధ్యక్షుడు



తాగునీటి సమస్యను గుర్తించేందుకు అజార్‌గల్లీలో పైప్‌లైన్‌ను పరిశీలించేందుకు తవ్విన జలమండలి అధికారులు

విశ్వం కుటుంబానికి కిషన్‌రెడ్డి పరామర్శ



విశ్వం కుటుంబాన్ని పరామర్శిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తదితరులు

ముషీరాబాద్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : ముషీరాబాద్‌కు చెందిన బీజేపీ రాష్ట్ర నాయకుడు ఆర్ విశ్వం ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో విషయం తెలుసుకున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. విశ్వం కుటుంబసభ్యులు, వారి కుమారుడు రాజేష్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు. పార్టీ కోసం విశ్వం క్రమశిక్షణతో పనిచేశారని అన్నారు. ఆయన లేని లోటు తీర్చలేనిదని పేర్కొన్నారు. విశ్వం కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని, అధైర్య పడవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు నందగిరి నర్సింహ, జమాల్‌పురి నందు, భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్, బబ్లూ, నాయకులు శ్రీధర్, సాయియాదవ్, సత్యనారాయణ పాల్గొన్నారు.



మాజీ ఎంపీ వీహెచ్, మోతే రోహిత్‌ను సత్కరిస్తున్న కాంగ్రెస్ నేతలు

కష్టపడే ప్రతీ కార్యకర్తకు తగిన గుర్తింపు : వీ.హెచ్

నల్లకుంట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో కష్టపడే ప్రతీ కార్యకర్తకు తగిన గుర్తింపు తప్పక లభిస్తుందని మాజీ ఎంపీ వి.హనుమంత రావు పేర్కొన్నారు. ఖైరతాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన మోతే రోహిత్ ముదిరాజ్ ఆదివారం బాగ్అంబర్‌పేటలోని వీహెచ్‌ను మర్యాదపూర్వకంగా ఆయన నివాసంలో కలిసి ఆశీర్వాదం పొందారు. అనంతరం వీహెచ్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. రోహిత్ ముదిరాజ్ మాట్లాడుతూ పార్టీ తనపై నమ్మకంతో కట్టబెట్టిన పదవికి వమ్ము చేయనన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ వీహెచ్, మోతే రోహిత్ ముదిరాజ్‌లకు ఖైరతాబాద్ జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్ శాలువ కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, ఉపాధ్యక్షుడు అఫ్సర్ యాసుఫ్ జాహి, మాజీ కార్పొరేటర్ పుల్లా నారాయణ స్వామి, బాగ్అంబర్‌పేట డివిజన్ పార్టీ అధ్యక్షుడు గడ్డం శ్రీధర్‌గౌడ్, నాయకులు చేనిగెల సుధాకర్, జహంగీర్, రోహిన్‌గౌడ్ పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి

గోల్నాక, నవంబర్ 23(ఆంధ్రజ్యోతి): నాలుగు లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ అంబర్‌పేటజోన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అంబర్‌పేట శివంరోడ్‌లోని లేబర్ అడ్డావద్ద కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫ్లకార్డులతో నిరసన చేపట్టారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ బీజేపీ మోదీ సర్కార్ కార్పొరేట్ పెట్టుబడిదారులకు లాభాలు చేకూర్చే విధంగా నాలుగు లేబర్ కోడ్స్‌ను తీసుకరావడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ సీఐటీయూ నేతలు, కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ నగర నాయకులు ఎం.మహేందర్, నగర ఉపాధ్యక్షుడు జి.రాములు మాట్లాడుతూ కార్పొరేట్ పెట్టుబడిదారులకు కార్మికశక్తిని కారు చౌకగా అందించి వారికి అత్యధిక లాభాలు చేకూర్చే విధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ నాలుగు లేబర్ కోడ్స్‌ను తీసుకవచ్చి కార్మికులను శ్రమదోపిడీకి గురిచేస్తుందని తీవ్రస్థాయిలో విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎం. సురేష్, తిరుపతి, యాకయ్య, ప్రభాకర్, గణేష్, ఈర్యా పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సాయికృష్ణయాదవ్, శేషసాయి తదితరులు

పార్టీ పటిష్టతకు పనిచేయాలి : సాయికృష్ణయాదవ్

రాంనగర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : అడిక్‌మెట్ డివిజన్‌లో పార్టీ పటిష్టత కోసం ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పాశం సాయికృష్ణయాదవ్ సూచించారు. బీజేపీ అధిష్టానం ఇచ్చే కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అడిక్‌మెట్ డివిజన్‌లో పార్టీని బలోపేతం చేయడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం డివిజన్‌లోని లలితానగర్ కమ్యూనిటీహాల్‌లో పార్టీ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో డివిజన్‌లో పార్టీ గెలుపే లక్ష్యంగా ఇప్పటి నుంచి ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆర్.శేషసాయి, ఎం.సీ.ఏ.మోహన్, బాలరాజ్, నరేష్, ప్రదీప్, జనార్దన్‌రెడ్డి, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారమే లక్ష్యం : ఆమనగంటి సైదులు



మాట్లాడుతున్న ఆమనగంటి సైదులు

రాంనగర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : అణగారిన కులాల రాజ్యాధికారం కోసం రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి ఉచిత విద్య, వైద్యం అందించాలనే లక్ష్యంతో సామాజిక తెలంగాణ పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు ఆవిర్భావ సభలో రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఆమనగంటి సైదులు పేర్కొన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సామాజిక తెలంగాణ పార్టీ ఆవిర్భావ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మార్పులు తీసుకువచ్చే విధంగా అవినీతిని ఎండగడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా నిరంతర పార్టీ కార్యకర్తలు పనిచేస్తూనే ఉంటారని అన్నారు. ప్రభుత్వం ఉచిత పథకాల పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ రాష్ట్రాన్ని అప్పులకుప్పగా చేస్తూ సామాన్యుడి నడ్డి విడుస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ పార్టీ అధ్యక్షుడు మెట్టు శివశంకర్, యువజన అధ్యక్షుడు రాజకుమార్‌గౌడ్, నాయకులు హరిత్ రూడా, పి.మధుసూదన్, గోపీ శ్రీనివాస్, సతీష్‌యాదవ్ పాల్గొన్నారు.

మనోహర్‌రెడ్డికి ధ్రువీకరణ పత్రం అందజేత



అధ్యక్షుడు మనోహర్‌రెడ్డికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారులు

రాంనగర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్కు వాకర్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ 2026 నూతన అధ్యక్షుడిగా ఎస్.మనోహర్‌రెడ్డి గత వారం ఎన్నికయ్యారు. కాగా ఆదివారం ఎన్నికల అధికారులు టి.రవికుమార్, ఎస్.రవికుమార్, శరత్‌కుమార్‌లు ఎస్.మనోహర్‌రెడ్డికి ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ క్లబ్ సభ్యులు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టేందుకు అంకితభావంతో పనిచేస్తానన్నారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ఆయన క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ నాయకులు, వాకర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

● ప్రారంభించిన ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్



కంటి పరీక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్ తదితరులు

నల్లకుంట/ముషీరాబాద్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్‌లు సూచించారు. ఆదివారం విద్యానగర్‌లోని ఎస్‌వీఎస్ కళాశాల ప్రాంగణంలో యోగక్షేమం వహామ్యహం ఛారిటీ ట్రస్టు ఆధ్వర్యంలో సాధూరాం కంటి ఆస్పత్రి సహకారంతో ఉచిత కంటి పరీక్ష కంటి శుక్లాల సర్జరీ శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యేలు వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. చూపు లోపం వల్ల భవిష్యత్‌లో సమస్యలు ఏర్పడుతాయని సమస్య చిన్నగా ఉన్నప్పుడే మెరుగైన వైద్య సేవలు పొందాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు మానవత దృక్పథంతో ముందుకు రావాలన్నారు. యోగక్షేమం వహామ్యహం ఛారిటీ ట్రస్టు నిర్వహించిన సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయం అని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు వ్యవస్థాపకుడు వారణాసి కృష్ణమూర్తి, సభ్యులు అనసూయ జోషీ, ఎస్ఎస్ రాజు, వసుంధరా, సుబ్బారావు, బీఆర్ఎస్ నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఎస్సీ బాలికల వనభోజనం



గాంధీనగర్ కోదండరెడ్డి పార్కులో వనభోజన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అసిస్టెంట్ సోషియల్ వెల్ఫేర్ ఆఫీసర్ శాంతి

ముషీరాబాద్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం భోలక్‌పూర్‌లోని ఎస్సీ బాలికల వసతి గృహం విద్యార్థినులకు వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. భోలక్‌పూర్ గాంధీనగర్‌లో గల కోదండరెడ్డి పార్కులో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ సోషియల్ వెల్ఫేర్ ఆఫీసర్ శాంతి ముఖ్య అతిథిగా హాజరై వనభోజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో ఐక్యత, మన సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసే విధంగా వనభోజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో సంతోషంగా గడిపారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ సుకన్య తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతకు నిలయాలు ఆలయాలు : అంజన్‌కుమార్‌యాదవ్



కార్యక్రమంలో పాల్గొన్న అంజన్‌కుమార్ యాదవ్, జానకీసుధాకర్ తదితరులు

చిక్కడపల్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతకు నిలయాలు ఆలయాలు అని టీపీసీసీ వర్కింగ్ అధ్యక్షుడు, మాజీ ఎంపీ ఎం. అంజన్‌కుమార్‌యాదవ్ అన్నారు. ఆలయాలను అభివృద్ధి చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా కృషి చేస్తుందని ఆయన వెల్లడించారు. చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో సిద్ధి బుద్ధి సహిత గణపతి, దత్తసాయి విగ్రహ పునర్ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం వైభవోపేతంగా జరిగింది. ఆంజనేయస్వామి ఆలయానికి 160 కేజీల వెండి సంజీవిని రామనామంతో కూడిన వెండి కొండ, స్వామివారి సింహాసనం పీఠం, పంచలోహాలతో కూడిన సీతారామలక్ష్మణ విగ్రహాలకు మకరతోరణం, ఆంజనేయస్వామి విగ్రహానికి మకరతోరణం, గర్భాలయానికి వెండి గడప, తలుపులు, షట్టర్ కవచం, ఒంటె వాహనం ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. అదేవిధంగా ఆంజనేయస్వామి ఆలయ సింహద్వారానికి పంచలోహాలు, గర్భాలయ నాలుగు గోడలకు బంగారు తాపడంతో కూడిన సుందరకాండకు సంబంధించిన చిత్రాలు ఏర్పాటు పనులు ప్రారంభం ఈసందర్భంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంజన్‌కుమార్‌యాదవ్‌తో పాటు ఎమ్మెల్యే ముఠా గోపాల్, స్థానిక గాంధీనగర్ కార్పొరేటర్ ఎ. పావనీవినయ్‌కుమార్, దేవాదాయశాఖ అదనపు కమిషనర్ శ్రీనివాసరావు, దేవాలయ కమిటీ సభ్యులు, వివిధ పార్టీల నేతలు, భక్తులు పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ జానకీసుధాకర్, ఈవో మాచర్ల దేవనాథం ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బాకారం ధర్మాచరణ సమితి అధ్యక్షుడిగా అనిల్‌కుమార్‌యాదవ్ ఏకగ్రీవం



బాకారం ధర్మాచరణ సమితి నూతన అధ్యక్షుడిగా తన సర్టిఫికెట్ చూపిస్తున్న పాశం అనిల్‌కుమార్‌యాదవ్ తదితరులు

రాంనగర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్‌లోని బాకారం ధర్మాచరణ సమితి నూతన అధ్యక్షుడిగా 7వ సారి పాశం అనిల్‌కుమార్‌యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన సమితి సర్వసభ్య సమావేశంలో ఏ.నర్సింహ, కమిటీ సభ్యులు అతిన గరం సుధేష్‌కుమార్, కె.రవిచారి ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా బి.మహేశ్వర్, సంయుక్త కార్యదర్శులుగా సత్యనారాయణచారి, నారాయణమూర్తి, కమిటీ సభ్యులుగా ఎం.సుధీర్, ఏ.సాయియాదవ్ నియమితులయ్యారు. ఏకగ్రీవంగా తనను ఎన్నుకున్నందుకు పాశం అనిల్ కుమార్‌యాదవ్ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయాలి : గౌతమ్‌రావు



మాట్లాడుతున్న డాక్టర్ గౌతమ్‌రావు, చిత్రంలో మాజీమంత్రి కృష్ణయాదవ్ తదితరులు

గోల్నాక, నవంబర్ 23(ఆంధ్రజ్యోతి): వందేమాతరం 150 సంవత్సరాల కార్యక్రమం, బిర్సాముండా, సర్దార్‌పటేల్ 150వ జయంతోత్సవాలు, ఏక్తాయాత్రను విజయవంతంగా నిర్వహించడానికి పార్టీ శ్రేణులు పనిచేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం బీజేపీ గోల్నాక డివిజన్ అధ్యక్షుడు సూదగాని శ్రీధర్‌గౌడ్ అధ్యక్షతన డివిజన్ పార్టీ కార్యకర్తల సమావేశం డివిజన్‌లోని గోవింద్‌నగర్‌లో గల ఎస్.కే. ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహిస్తుందని, అధిష్ఠానం ఇచ్చిన పిలుపు మేరకు ఆ కార్యక్రమాలను విజయవంతం చేయాల్సి బాధ్యత పార్టీ శ్రేణులందరిపై ఉందన్నారు. ఈ సమావేశంలో మాజీమంత్రి సి.కృష్ణయాదవ్, పార్టీ సెంట్రల్ జిల్లా కార్యాలయ కార్యదర్శి మూల రవీందర్‌గౌడ్, పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కేసరి నర్సింగ్‌రావుయాదవ్, పార్టీ నాయకులు చింతల శ్రీనివాస్ ముదిరాజ్, కె.చంద్రకాంత్‌యాదవ్, కె.రాంచందర్, దామోదర్‌నాయుడు, స్వప్న, ప్రియా, సునీల్, ఈశ్వర్‌రావు, సింగీతం రాజేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

సామూహిక అయ్యప్ప మాలధారణ

ముషీరాబాద్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి భక్తులు ఆదివారం భోలక్‌పూర్ నుంచి ర్యాలీగా తరలివెళ్లి బొల్లారంలోని అయ్యప్ప ఆలయంలో సామూహిక అయ్యప్ప మాల ధరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై. శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ 40 రోజుల పాటు నిష్ఠతో ఉండి అయ్యప్పస్వామికి పూజలు నిర్వహిస్తామని తెలిపారు. అందరం ఒకే సారి మాల ధరించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్పస్వాములు కిషోర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామపాలన ఆఫీసర్స్ అసోసియేషన్ తెలంగాణ ఆవిర్భావం



అభివాదం చేస్తున్న గ్రామపాలన ఆఫీసర్స్ అసోసియేషన్ తెలంగాణ నాయకులు

రాంనగర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ముందుకు సాగాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గ్రామపాలన ఆఫీసర్స్ అసోసియేషన్ తెలంగాణ ఆవిర్భావం సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైన రాష్ట్ర కమిటీని ప్రకటించారు. గ్రామపాలన ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గరిగె ఉపేంద్ర, మహిళా అధ్యక్షురాలుగా కంది శిరీష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా అర్జున్, ఆర్.విజయ్‌కుమార్, కోశాధికారిగా ఇంజమూరి ఈశ్వర్, సెక్రటరీ జనరల్‌గా వి.లక్ష్మీనరసింహులు, దాసరి వీరన్న, అసోసియేట్ అధ్యక్షులుగా కారుమూరి చంద్రయ్య, చిరంజీవి ముదిరాజ్, ఉపాధ్యక్షులుగా రమేష్, ప్రతిభ, నర్సింహారావు, లక్ష్మీనారాయణ, నాగలక్ష్మి, కార్యదర్శులుగా ప్రసాద్, శ్రీనివాస్, సునీత మల్లీశ్వరి, కోటేశ్వరరావు నియమితులయ్యారు.

‘లేబర్ కోడ్స్‌ను ఉపసంహరించుకోవాలి’

చిక్కడపల్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కేంద్రం తెచ్చిన ప్రమాదకర నాలుగు లేబర్ కోడ్స్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో చిక్కడపల్లి లేబర్ అడ్డా వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నగర అధ్యక్షుడు ఎం. దశరథ్ మాట్లాడుతూ ఈ నాలుగు లేబర్ కోడ్స్‌ను తెచ్చి పేద కార్మికుల పొట్ట కొట్టి కార్పొరేటర్లకు పెట్టాలని చూస్తుందని మండిపడ్డారు. ఈ కోడ్స్‌కు వ్యతిరేకంగా కార్మికవర్గం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మల్లయ్య ఆంజనేయులు, నరసింహ, యాకయ్య, రాములు, కిరణ్, మున్నా, వెంకటేష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి బీజేపీ శ్రేణులకు దిశానిర్దేశం



మాట్లాడుతున్న వినయ్‌కుమార్

చిక్కడపల్లి : డివిజన్‌లోని ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేవిధంగా బీజేపీ డివిజన్ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశామని ఆ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్ తెలిపారు. రాబోయే రోజుల్లో గాంధీనగర్ డివిజన్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించబోయే ముఖ్య కార్యక్రమాల కార్యాచరణ సమావేశం డివిజన్ అధ్యక్షుడు వి. నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం అశోక్‌నగర్ వెల్ఫేర్ సెంటర్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వినయ్‌కుమార్, మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధికార ప్రతినిధి, దిశ కమిటీ సభ్యుడు శారదా మల్లేష్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో డివిజన్‌లో చేపట్టాల్సిన కార్యక్రమాలు, వందేమాతరం 150 సంవత్సరాల వేడుకలు, సర్దార్‌వల్లభాయ్‌పటేల్ 150వ జయంతి, ఆత్మనిర్భర్ భారత్, బూత్ కమిటీలు వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వినయ్‌కుమార్ మాట్లాడుతూ పార్టీ సూచనల మేరకు జరగబోయే కార్యక్రమాలను నాయకులు, కార్యకర్తలతో కలిసి నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. సమావేశంలో పార్టీ సీనియర్ నేతలు, డివిజన్ పదాధికారులు, నాయకులు, మోర్చాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలి

చిక్కడపల్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతూ నిరుద్యోగులు దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా ఆలయంలో దీక్ష నిర్వహించినట్లు నిరుద్యోగ జేఏసీ నేతలు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం చిక్కడపల్లి సిటిసెంట్రల్ లైబ్రరీ వద్ద జేఏసీ నేతలు దామోదర్‌రెడ్డి, శివ, అనిల్ మాట్లాడుతూ నోటిఫికేషన్ విడుదల చేసేలా ప్రభుత్వానికి జ్ఞానోదయం కలిగించాలని నిరుద్యోగులు సాయిబాబాను కోరుకున్నట్లు వివరించారు.



సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షిస్తున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

వైభవంగా సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలు

రాంనగర్ : భగవాన్ సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా 8వరోజు ఆదివారం విద్యానగర్ శివం ప్రాంగణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు సుప్రభాతం, సాయి జగన్నాథ రథోత్సవం, నగర సంకీర్తన, భక్తిగీతాలతో జరిగాయి. రాత్రి 108 మంది గాయకులు త్యాగరాజ పంచరత్న కీర్తనలు గంటన్నరపాటు ఆలపించారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. మంగళహారతితో సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు ముగిశాయి.

ఘనంగా ఎన్‌సీసీ 78వ వార్షికోత్సవం



ఎన్‌సీసీ 78వ వార్షికోత్సవంలో కెడెట్స్‌తో కలిసి పాల్గొన్న మేజర్ జనరల్ అజయ్‌మిశ్రా, కమోడోర్ నర్సింగ్‌సైలానీ

అల్వాల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో ఆదివారం మెహదీపట్నం గారిసన్ గ్రౌండ్స్‌లో ఎన్‌సీసీ 78వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన అతిథులకు జాతీయ జెండాలు చేత పట్టుకుని గుర్రపు స్వారీ చేస్తూ స్వాగతం పలికారు. ముఖ్య అతిథిగా హాజరైన మేజర్ జనరల్ అజయ్‌మిశ్రా కెడెట్స్‌ను ఉద్దేశించి ప్రసంగించారు. ఎన్‌సీసీ నినాదం- కెడెట్స్‌ల జీవితంలో ఐక్యత, క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తితో పాటు ధైర్యం, దృఢత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో యువ కెడెట్స్ సాధించిన విజయాలతో పాటు పురస్కారాలను కూడా ఆయన హైలెట్ చేశారు. యువతను తీర్చిదిద్దడంలో ఎన్‌సీసీ కీలక పాత్రను పోషిస్తుందన్నారు. కెడెట్స్‌ల సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఎంతో గాను ఆకట్టుకున్నాయి. ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ కమోడోర్ నర్సింగ్ సైలానీ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి జీవితంలో క్రమశిక్షణ ఎంతో అవసరమని, దేశంలోని యువతను తీర్చిదిద్దడంలో ఎన్‌సీసీ ఎంతోకృషి చేస్తుందన్నారు. ఆల్ ఇండియా స్థాయిలో నిర్వహించిన శిబిరాల్లో కెడెట్స్ కీలక విజయాలను సాధించారని ఆయన కొనియాడారు.

‘చేతిరాతను బట్టి మనస్తత్వాన్ని చెప్పవచ్చు’



మాట్లాడుతున్న ప్రొఫెసర్ రామచంద్రయ్య

రాంనగర్ : చేతిరాతను బట్టి మన మనస్తత్వాన్ని చెప్పవచ్చని సీఈఎస్ఎస్ రిటైర్డ్ ప్రొఫెసర్ సి.రామచంద్రయ్య పేర్కొన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో గ్రాఫాలజీ - గ్రాఫోతెరపి అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతిరాతకు సైకాలజీకి సంబంధం ఉందని, చేతిరాతను బట్టి మన మనోభావాలను, మానసిక స్థితిని తెలుసుకోవచ్చని తద్వారా చేతిరాతతో మార్పులు చేసుకోవడం ద్వారా కొన్ని మానసిక విషయాలను అధిగమించవచ్చని అన్నారు. ప్రముఖ మిమిక్రీ కళాకారుడు రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పర్యావరణ వేత్త డాక్టర్ జయసూర్య, ఎం.శ్రీనివాస్, రాజీవ్‌కుమార్, భవానీశంకర్, ఎం.శ్రీనివాసరావు, కె.వీరయ్య, పి.శ్రీనివాసరావు, సుకుమార్, శంకర్, రఘు, మోహన్‌నాయుడు పాల్గొన్నారు.